క్లుప్తంగా

నేడు టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

గిద్దలూరు రూరల్: ప్రకాశం జిల్లా 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 క్రీడాకారులను గిద్దలూరులోని క్లబ్ రోడ్డులో ఉన్న టెన్నిస్ కోర్టులో మంగళవారం ఎంపిక చేస్తున్నట్లు స్కూల్ గేమ్స్ చీఫ్ ఆర్గనైజర్ డైరెక్టర్ గుర్రం శోబన్‌బాబు తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు నిర్వాహకులను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. చింతలపల్లె, వర్ధనపల్లె గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

18న ఐటీఐలో జాబ్‌మేళా

మార్కాపురం టౌన్: ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఈనెల 18వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.వాసుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రీమియం ఎనర్జీ లిమిటెడ్‌తోపాటు ఇతర కంపెనీలు స్థానిక ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9553306631ను సంప్రదించాలని సూచించారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

కొమరోలు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి స్థితిగతులు తెలుసుకున్నారు. ఎంపీపీ అమూల్య మాట్లాడుతూ.. మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, మండలాభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ చెన్నారావు, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జేవీవీ రాష్ట్ర కార్యదర్శిగా స్వరూపారెడ్డి



మహాసభల సమావేశంలో పి.స్వరూపారెడ్డి

గిద్దలూరు రూరల్: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శిగా గిద్దలూరు పట్టణానికి చెందిన పి.స్వరూపారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయనగరం గురజాడ అప్పారావు ప్రాంగణంలో నిర్వహించిన 18వ రాష్ట్ర మహాసభల కార్యక్రమంలో తనను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు స్వరూపారెడ్డి సోమవారం తెలిపారు. మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మరింత కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు పట్టణ ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

ప్రత్యేక అభ్యసన దీపిక ఆవిష్కరణ

తర్లుపాడు: తెలుగు చదవడం, రాయడంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన పాఠ్య పుస్తకాన్ని ఎంఈఓ డి.సుజాత సోమవారం ఆవిష్కరించారు. మండలంలోని జగన్నాథపురం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం కశ్శెట్టి జగన్‌బాబు దాతల సహాయంతో 1500 పుస్తకాలు ప్రింట్ చేయించి తర్లుపాడు మండలంలోని విద్యార్థులకు ఎంఈఓ సుజాత చేతుల మీదుగా అందించారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యార్థులపై శ్రద్ధ కనబరిచి పుస్తకాన్ని రూపొందించిన జగన్‌బాబును ఎంఈఓతోపాటు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు. దాతలు పి.బాలమోహన్ రావు, ఎ.రాము, ఎ.వెంకటేశ్వర్లు, జి శ్రీనివాస్ రెడ్డి, కె.బాల వెంకట సత్యనారాయణ, సీహెచ్ శ్రీనివాసులు, శ్రీధర్, కె.స్వాతి, కె. హరీష్, బి.సురేష్, వై.బాలు, కె.వెంకటేశ్వర్లు, ఆర్.వెలుగొండస్వామి, పినాకపాణికి హెచ్ఎం జగన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులపై పని భారం తగ్గించాలి



ఎంపీడీఓకు అర్జీ ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

తర్లుపాడు: ప్రభుత్వ ఉద్యోగులమైన తమపై అదనపు పనిభారాన్ని మోపడంపై మండలంలోని సచివాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీఓ బి.చంద్రశేఖర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. వలంటీర్ల సేవలైన హౌస్ మ్యాపింగ్, వాట్సప్ సేవల ప్రచారం, అధికారం మాటున వేధింపులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దిష్ట పనులలంటూ అప్పగించకుండా ఇష్టానుసారం ప్రతి పనీ చేయాలని ఆదేశించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము అనారోగ్యం బారిన పడుతున్నామని, ఇకనైనా పనిభారం తగ్గించాలని ఎంపీడీఓను కోరారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడంతోపాటు ప్రమోషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగర్ నీరు వచ్చేనా?

- పొదిలి విశ్వనాథపురం మొదటి, రెండు లైన్లకు నిలిచిన సరఫరా
- లీకేజీలు, పైప్‌లైన్ ధ్వంసం కావడంతోనే సమస్య
- మురుగు గుంతతో తంటాలు పడుతున్న స్థానికులు
- రోడ్డుపైనే చెత్త కుప్పలు వేస్తుండటంతో అధ్వానంగా పారిశుధ్యం



పొదిలి విశ్వనాథపురం మొదటి లైన్ వ్యూ



విశ్వనాథపురం రెండో లైనులో మురుగు గుంత

పొదిలి: పొదిలిలో తాగునీటి కష్టాలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. స్థానిక విశ్వనాథపురం నడిబొడ్డున ఉన్న కాలేజీ రోడ్డులోని మొదటి, రెండు లైన్ల వాసులు సాగర్ నీరు లేక అవస్థలు పడుతున్నారు. పురాతన కాలం నాటి పైపులైన్లకు లీకులు ఏర్పడి తుప్పు పట్టిపోగా వాటిని బాగు చేయించే విషయాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ రెండు లైన్లలో నివాసం ఉంటున్న వారికి మంచినీటి సమస్య అధికంగా ఉంది. రెండో లైన్లో కింద బాగాన కొంత మేర సాగర్ నీరు వస్తున్నప్పటికీ, అవి మురుగుతో కూడి ఉండటంతో వాడుకోవడం మానేశారు. తమకు ఇప్పట్లో సాగర్ నీరు తాగే అదృష్టం దక్కుతుందా అని స్థానికులు మదన పడుతున్నారు. బుగ్గజలం నీరు వస్తున్నప్పటికీ అవి మోటార్లు ఉన్న వారికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. మంచినీటి అవసరాలకు మాత్రం బబుల్ నీటినే ఉపయోగించుకోవాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదిలి నగర పంచాయతీగా మారిన తర్వాత అయినా సాగర్ నీరు వస్తుందని ఆశతో ఎదురు చూసిన స్థానికులకు ఏళ్లు గడుస్తున్నా నిరాశే మిగులుతోంది. నరసింహారెడ్డి కాంప్లెక్స్, స్టేట్ బ్యాంకు సమీపంలో, శివాలయం వద్దకు వెళ్లి సాగర్‌నీరు తెచ్చుకుంటున్నారు. అవి తెచ్చుకునే అవకాశం లేని కుటుంబాల వారు బుగ్గజలం నీటినే వాడుకుంటున్నారు.

మురుగు గుంత, చెత్తతో అవస్థలు

విశ్వనాథపురం రెండో లైనులో మంచినీటి సమస్యతోపాటు మురుగు గుంత సమస్య అదనం. నిత్యం ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగించే సిమెంటు రోడ్డు చెత్త కుండీలా మారింది. ఈదారిన విద్యార్థులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. కాలువల్లో మురుగు ఎక్కడికక్కడ నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. పలు గృహాల్లోకి మురుగు చేరుతుండటంతో వాటి యజమానుల బాధలు వర్ణనాతీతం. మురుగుగుంత వద్ద వాహనాలు అటు ఇటు పోయేందుకు సరిపోయే రోడ్డు లేక ప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ కమిషనర్ అయినా స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సాగర్ నీటి సమస్య తీర్చాలి

మొదటి, రెండో లైన్‌లోని సాగర్‌నీటి సమస్యను, మురుగు గుంత సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకవెళ్లాం. ప్రతిపాదనలు పంపించామని పలుమార్లు చెప్పినప్పటికీ పనులు మాత్రం జరగలేదు. ప్రధానమైన సాగర్‌నీరు లేకపోతే స్థానికులు మంచి నీటి కోసం అవస్థలు పడుతున్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం.

– ఎం.రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి



నగర పంచాయతీ అధికారులు స్పందించాలి

నగర పంచాయతీ అధికారులు స్పందించి సాగర్‌నీరు, మురుగు సమస్య తీర్చాలి. ఏళ్ల తరబడి పాలకులు పట్టించుకోకపోవడం మూలంగానే సమస్య పరిష్కారం కాలేదు. రూ.20 వేలు ఖర్చు చేసి పైపు కల్వర్టు ఏర్పాటు చేస్తే మురుగు సమస్య పరిష్కారం అవుతుంది. అది కూడా పట్టించుకోకపోవడంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– బూదాల జాన్ ప్రకాశ్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మార్కాపురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రఘుబాబు, ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. రణభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం తహసీల్దార్ చిరంజీవికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఆర్థిక బకాయిలు విడుదల చేయడంలోగానీ, ఉద్యోగులకు సమయానుకూలంగా ఆర్థిక ప్రయోజనాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన సవరణలు, కరువు భత్యం మంజూరు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచాయని, ప్రభుత్వ తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి మెమో నంబరు 57ను అమలు చేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. అన్ని రకాల బకాయిలు చెల్లించాలని ఈహెచ్ఎస్ పరిమితి రూ.25 లక్షలకు పెంచాలన్నారు. యాప్‌లను, అసైన్‌మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కట్టా కిరణ్‌కుమార్, డి.దాస్, ఎం.మహేష్, రాఘవ, పీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అర్ధవీడు ఎస్సై



శివనాంచారయ్య

అర్ధవీడు: మండల నూతన ఎస్సైగా ఎం.శివ నాంచారయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సుదర్శన్ యాదవ్‌ను ఒంగోలు వీఆర్‌కు పంపారు. గిద్దలూరులో పని చేస్తున్న శివ నాంచారయ్యను అర్ధవీడుకు బదిలీ చేశారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన ఎస్సై శివ నాంచారయ్య తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గొట్లగట్టు విద్యార్థులు



ఆకాష్



శ్రీలత

కొనకనమిట్ల: విజయవాడలోని గొల్లపూడిలో ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న 51వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ కబడ్డీ పోటీలకు మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఇద్దరు ఎంపికయ్యారని కబడ్డీ కోచ్ యరగొర్ల బాలగురవయ్య, హెచ్ఎం టి.ఆదినారాయణ తెలిపారు. కె.ఆకాష్, ఎం.శ్రీలత ప్రకాశం జిల్లా జట్ల కెప్టెన్లుగా ప్రాతినిధ్యం వహించనున్నారని కోచ్ పేర్కొన్నారు. క్రీడాకారులతోపాటు కోచ్‌ను పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాల క్రీడాకారులు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ త్రివినాగ్



అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: ప్రతి సోమవారం సబ్ కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న మీ కోసం కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే అర్జీలను అధికారులు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. సోమవారం ఆయన డివిజన్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామానికి చెందిన పిడమాల వెంకటేశ్వర్లు తన పట్టాభూమిలో రెవెన్యూ, పోలీసు అధికారులు తమకు తెలియకుండానే రోడ్డు వేశారని తనకు న్యాయం చేయాలని అర్జీ ఇచ్చారు. గ్రామ శివార్లలో 2 ఎకరాల పట్టా భూమి తన పేరుపై ఉందని, అయితే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు తమ పొలాలకు వెళ్లాలంటూ అర్జీ పెట్టగానే రెవెన్యూ పోలీసు అధికారులు వచ్చి తన భూమిలో రస్తా వేశారని, తన పట్టా భూమిలో రోడ్డు వేయడం వల్ల తీవ్రంగా నష్టపోయానన్నారు. ఈ వివాదం కోర్టులో ఉన్నప్పటికీ అధికారులు వారి ఇష్టం మేరకు వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి తన భూమిలో ఇచ్చిన రస్తాను రద్దు చేయించాలని అర్జీలో విన్నవించారు. కాగా మొత్తం 24 అర్జీలు వచ్చినట్టు కార్యాలయ సిబ్బంది తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాచర్లలో కోతుల బెడద



రాచర్ల బస్టాండ్ సెంటర్‌లో ఓ ఇంటి గోడపై కోతులు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా మారింది. గ్రామంలో బలిష్టంగా ఉన్న కోతులతో పాటు తల్లి కోతులు ఎక్కువగా ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తినుబండారాలతో బయట కనిపించిన చిన్నారులపై దాడి చేసి లాక్కెళ్లడం, బస్టాండ్‌లోని వివిధ షాపుల్లో తినుబండారాలు అపహరించడం వీటికి నిత్యకృత్యంగా మారింది. వాటి చర్యలకు అడ్డుతగిలితే మీదికి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోస్టాఫీసులో విధులు నిర్వహిస్తున్న పి.జనార్ధర్‌రెడ్డి విధుల్లో భాగంగా ఆదివారం గ్రామంలో తిరుగుతుండగా కోతులు అతని మీదకు దూకి తలపై దాడి చేశాయి. సంబంధించిన అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి



మాట్లాడుతున్న రైతు సంఘ జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

బేస్తవారిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలతో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి పేర్కొన్నారు. సోమవారం బేస్తవారిపేటలో నిర్వహించిన ఏపీ రైతు సంఘం నియోజకవర్గ సమావేశంలోనాయన మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు నరేంద్రమోదీ తాము అధికారం చేపట్టగానే స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు దాటినా మోదీ తన హామీని నిలబెట్టుకోలేదన్నారు. మన దేశంలో రొయ్యలు 40 శాతం అమెరికాకు ఎగుమతి చేస్తుండగా.. 50 శాతం సుంకం విధించడంతో రొయ్యలు సాగుచేసే రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఇతర దేశాల నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటే గతంలో ఉన్న 11 శాతం పన్ను రద్దు చేశారని, మనం ఇతర దేశాలకు ఎగుమతి చేయాలంటే 50 శాతం పన్ను విధించారని, అయినా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రెండేళ్లుగా సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పత్తి రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. శనగలకు 30 శాతం పన్ను ఉంటే నేడు జీరో చేసి మన దేశంలోని రైతులకు అన్యాయం చేస్తోందని కేంద్ర సర్కారుపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి ఢాకాల పుల్లయ్య, సీపీఐ సహాయ కార్యదర్శి యు.జోసఫ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కొమరోలు: మండలంలోని అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 మంది 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ స్టడీ మెటీరియల్స్‌ను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య సొంత నిధులతో సోమవారం అందించారు. ఈ స్టడీ మెటీరియల్‌ను పాఠశాల హెచ్ఎం పద్మజ విద్యార్థులకు పంపిణీ చేశారు.

దేశానికే ఆదర్శం మోక్షగుండం విశ్వేశ్వరయ్య



విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వెన్నా హనుమారెడ్డి, సిబ్బంది



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కిట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాలులర్పిస్తున్న డాక్టర్ షంషేర్ అలీబేగ్



బేస్తవారిపేట: విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డీఈ, ఏఈలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో సోమవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. స్థానిక కిట్స్, ఏ1 గ్లోబల్, వీహెచ్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కిట్స్ కళాశాలలో కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంగనాయకులు మాట్లాడుతూ.. భారతదేశానికి మోక్షగుండం అందించిన సేవలను కొనియాడారు. కోఆర్డినేటర్ పీవీ అనిల్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశప్రోభివృద్ధికి ఇంజినీర్స్ పాత్ర ఎంతో కీలకమని వీహెచ్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్ బాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఏ1 గ్లోబల్ కళాశాలలో చైర్మన్, ఏపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్‌అలీబేగ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని షంషేర్‌అలీబేగ్ సూచించారు. కళాశాలల డైరెక్టర్ మసూద్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ శామ్యూల్‌జార్జి కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరరావు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుకు కళాశాల టెక్నికల్ అడ్వయిజర్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుభాకాంక్షలు తెలిపారు.

విశ్వేశ్వరయ్య కృషి ఎనలేనిది

బేస్తవారిపేట: దేశం గర్వించదగిన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని గిద్దలూరు పంచాయతీరాజ్ డీఈఈ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఇంజనీర్స్ డే సందర్భంగా సోమవారం మండలంలోని మోక్షగుండంలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆధునిక భారతదేశంలో ఆనకట్టలు, రిజర్వాయర్లు, హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టల నిర్మాణంలో అసమాన ప్రతిభతో మోక్షగుండం ఎన్నో సేవలు అందించారన్నారు. ప్రపంచ మేధావి మన ప్రాంతానికి చెందినవారు కావడం జిల్లాకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈలు శ్రీనివాసనాయక్, సుబ్బారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.